
# బ్రహ్మాపట్నం పోదమంటే...

ఎస్. నారాయణ



తూర్పుకు వున్న కిటికీని తెరవాలా ? వద్దా ? అన్న అనుమానంతో, తటపటాయిస్తూ గదిలో నిలబడ్డాడు విశ్వనాథ్. గదికంతా వెలుగు నింపేది ఆ కిటికీనే. బహుశ, అదే చివరి రోజు కావచ్చు కిటికీ తెరవడానికి ! ఏదో తెలియని దుఃఖం గొంతులో వుండకట్టుకుంటోంది. " ఛీ! ఛీ! ఏమిటిది ? ఇంత సెంటిమెంటల్‌గా ఫీలవుతున్నా ? ఈ బుద్ధి తక్కువదనమే కదా జీవితాన్ని పెడదావ పట్టించింది!" తన మీద తాను కోపం చేసుకోవడానికి ప్రయత్నించాడు విశ్వనాథ్. నిజానికి గత వారం రోజులుగా విశ్వనాథ్‌లో విసుగూ, కోపం పెరిగిపోతున్నాయి. కానీ, ప్రతిరోజూ ఉదయం ఆ తూరుపున వున్న కిటికీని తీస్తూనేవున్నాడు. ఈ రోజు మాత్రం గట్టి నిర్ణయానికి రావటానికి ప్రయత్నిస్తున్నాడు. " కలలు, ఆశయాలూ భ్రమలుగా తేలిపోయి, జీవితాన్ని క్రూరంగా వంచించిన ఈ విషాద సమయంలో, ఇంకా భ్రమ ఎందుకు ? తనను తాను భ్రమ పెట్టుకోకుండా బతకలేడా ? వద్దు. వద్దు. ఇంతవరకూ జరిగింది చాలు !" అనుకుంటూ అడుగు వెనక్కు వేయబోయాడు విశ్వనాథ్.

కానీ, అదే క్షణంలో ఏదో తెలియని లోతుల్లోంచి వుద్వేగం తోసుకురావటంతో, తన ప్రమేయం లేకుండానే అడుగు ముందుకు వేసి, కిటికీ తెరిచాడు విశ్వనాథ్. చలికాలం ప్రొద్దుటి ఎండ మృదువుగా, వెచ్చగా గదిలోకి పాకింది. విచ్చుకున్న కళ్ళతో తదేకంగా చూస్తున్నాడు విశ్వనాథ్. ఎదురుగా, ఒడినిండా పెరుగుతున్న చెట్లతో, గంభీరంగా నీలాకాశంలోకి చొచ్చుకుపోతూ నిలబడ్డ కొండ ! రెండేళ్ళ కిందట మొదటిసారి చూసిన నాటినుండి, ఈ రోజు దాకా, ఎత్తయిన ఆ కొండ ఏదో ఇంద్రజాలం చేస్తున్నట్టనిపిస్తుంది విశ్వనాథ్‌కు. అట్లా చూస్తుంటే, చూపు, కొండ మాత్రమే నిలిచిపోయి ఏదో చెప్పలేని దగ్గరితనమూ, లోలోపల ఆనందంలాంటి ఏదో కదలికా...

" నమస్కారం, డాక్టరుగారూ !"

మంద్రంగా పలికిన ఆ కంఠస్వరం విశ్వనాథ్‌ను వులిక్కిపడేలా చేయలేదు కానీ, అతడి చూపును కొండ కొన నుండి మామూలు పరిసరాల్లోకి లాక్కొచ్చింది.

ఖద్దరు జుబ్బా, అడ్డపంచె, యాభై ఏళ్ళు వుండొచ్చు, నెరుస్తున్న జుట్టు, స్తబ్దంగా వున్న ముఖం, తేటగా నీటికాంతితో మెరుస్తున్న కళ్ళు - ఎర్రిమల్లయ్య !

అతణ్ణి చూడగానే కోపం ముంచుకొచ్చింది విశ్వనాథ్‌కు. కానీ, తమాయించుకుని -

" కూర్చోండి. దగ్గు, ఆయాసం ఎట్లా వుంది ?" అని అడిగాడు.

" మీరిచ్చిన మాత్రలతో దగ్గు బాగా తగ్గింది, డాక్టరుగారూ ! కానీ ఆయాసం కొద్దిగా వుంది. అందులోనూ, నిన్న మధ్యాహ్నంగా సత్య నారాయణతో కొండపైకి వెళ్ళొచ్చాను. కొండ చరియల్లో చెట్లు పెంచే పద్ధతి, కొండ మీద వుండే రెండు నీటి చెలమలు, అప్పట్లో సిద్ధుడు కూర్చొనే రావిచెట్టూ, సిద్ధుడి గుహ అన్నీ చూపించాడు " అంటూ ఆయాసాన్ని మించిన ఉత్సాహంతో వివరించాడు ఎర్రిమల్లయ్య.

సత్యనారాయణ పేరు వినగానే విశ్వనాథ్‌కు మనసులోని కోపం ఎగేసుకొచ్చింది. ఎదురుగా వుంటే నాలుగు తన్నాలన్నంత కోపం. సత్య నారాయణ పద్ధతేం నచ్చలేదు విశ్వనాథ్‌కు. చదువుకున్నవాడు, యువకుడు. తన చుట్టూ వున్న సమాజ వాస్తవాలను గురించి అవగాహన వున్నవాడు. ఎడారి ఛాయలు ప్రాకుతున్న అనంతపురం జిల్లాలో పచ్చని చెట్లు పెంచాలనే సంకల్పమూ, వుత్సాహమూ వున్నవాడు.

అందుకే ఈ మారుమూల పందలకుంట గ్రామానికి వచ్చి, ఓ స్వచ్ఛంద సంస్థ తరపున కొండల మీద చెట్లు పెంచే కార్యక్రమం చేస్తున్నాడు. అలాంటి వాడికి ఇదేమి పని. ఏ సాధువునో, సన్యాసినో పిలుచుకు రమ్మని వాళ్ళమ్మ చెబితే, వెంటనే వెళ్ళి ఎట్లా పిలుచుకొస్తాడు సత్యనారాయణ ? అట్లా చెయ్యడం ఎంత మూర్ఖం! ఈ విషయం అతనికి ఎందుకు తోచలేదు ? తల్లి కోరిక మేరకే ఈ ఎర్రి మల్లయ్యను సంగమేశ్వరం నుండి పిలుచుకొచ్చాడు సత్యనారాయణ. తత్త్వాలు వినాలని తల్లికి చాలా కోరికట ! వాళ్ళమీద, వీళ్ళమీద పడి పొట్ట గుడుపుకునే ఈ స్వామి తత్త్వాలు వినకపోతే ఏం? - కోపమూ, అసహనమూ చెలరేగాయి విశ్వనాథ్‌లో. సత్యనారాయణతో ఎంతో సాన్నిహిత్యం వుండటం కూడా ఈ కోపానికి కారణం. " ఈ రోజు సాయంత్రం కదిరి వెళ్ళి, అక్కడి నుండి సంగమేశ్వరం చేరుకుంటాను, డాక్టరుగారూ ! ఆయాసానికి మందో, మాత్రలో రాసిస్తే కదిరిలో కొనుక్కుని వెళతాను." అన్నాడు ఎర్రిమల్లయ్య. చిన్నగా వులికిపడి, ఆలోచనలలోంచి తేరుకున్నాడు విశ్వనాథ్. ఎదురుగా వున్న పేషెంటు సంగతి మరచిపోయి, తన ఆలోచనల్లో తాను మునిగిపోయినందుకు కాస్త సిగ్గుపడ్డాడు.

" అలాగే. మాత్రలు రాసిస్తాను. ఓ పదిరోజుల పాటువాడి, తర్వాత రక్త పరీక్ష చేయించుకోండి. ఈస్నోఫేలియా నాలుగు శాతం కంటె తక్కువ వుండాలి " అంటూ, మాత్రల పేరు రాసిన చీటీని ఎర్రి మల్లయ్య చేతికి అందించాడు విశ్వనాథ్ .

ఐనా మీ వంటి సాధువులు చిట్కా వైద్యాలు చేస్తూ జబ్బులు బాగు చేస్తుంటారు కదా ?" వెక్కిరింపుగా అన్నాడు విశ్వనాథ్. కానీ, అతడి వెక్కిరింపును ఎర్రిమల్లయ్య పట్టించుకున్నట్టు లేదు. " వైద్యం గురించి నాకేమీ తెలియదు, డాక్టరుగారూ ! నా శిష్యుడు కేశవయ్య కొన్ని జబ్బులకు ఆకులతో, వేర్లతో వైద్యం చేస్తుంటాడు. అని కొద్ది క్షణాలాగి -

" మిమ్మల్ని చూస్తుంటే నాకెంతో సంతోషంగా వుంది. ఎమ్.బి.బి.ఎస్. చదివిన మీరు ఈ మారుమూల పల్లెకు వచ్చి వైద్యం చేస్తున్నారంటే... పేదరికంలో నలుగుతున్న ఈ జనం మీద మీ కెంత ప్రేమ వుందో అర్థమౌతోంది. మీ వంటి వాళ్ళు చల్లగా వుండాలి. ఎప్పుడైనా తీరిక వున్నప్పుడు సత్యనారాయణతోబాటు ఆశ్రమానికి రండి. సెలవు తీసుకుంటాను, డాక్టరుగారూ !" అని, నమస్కారం చేసి వెళ్ళిపోయాడు ఎర్రిమల్లయ్య.

ఎర్రిమల్లయ్య మాటలు ఎంత వద్దనుకున్నా విశ్వనాథ్‌కు కొంత సంతోషాన్ని కలిగించాయి. మరోవైపు ఏదో తప్పు చేస్తున్నానన్న భావనకూడా కలిగింది అతడిలో. కానీ, వెంటనే ఆ భావాన్ని పోగొట్టుకోవడానికి ప్రయత్నించాడు.

" లేదు. లేదు. నా నిర్ణయంలో తప్పు లేదు. ఇక్కడి నుండి వెళ్ళి పోవాల్సిందే. నా ఆశ, ఆశయం వొట్టి భ్రమలని తేల్చారు ఈ జనం. ఇంక ఇక్కడ వుండటంలో అర్థం లేదు. నన్ను నేను మోసగించుకుంటూ బతకాల్సిన అవసరం లేదు. వెళ్ళిపోవాల్సిందే. ఈ రోజు పద్మ వస్తోంది.పద్మ, తానూ ఒకటయితే జీవితం వో కొత్త మలుపు తిరుగుతుంది." తనకు తాను, నమ్మకం కలిగేలా గట్టిగా మనసులో చెప్పుకున్నాడు విశ్వనాథ్.

"ఏమిటి సార్! డాక్టరుగారూ ! ఏదో పరధ్యానంగా వున్నారు " అంటూ లోపలికి వచ్చాడు సత్యనారాయణ.

" రా, సత్యం ! కూర్చో " ఆప్యాయంగా పిలిచాడు విశ్వనాథ్.

" ఎర్రిమల్లయ్య స్వామి మీ దగ్గరికి వస్తానని చెప్పారే. రాలేదా ?"

కుర్చీ లాక్కుని కూర్చుంటూ అడిగాడు సత్యనారాయణ.

" రాకేం. వచ్చాడు. మాత్రలు రాయించుకుని వెళ్ళాడు... అయినా నా కిదేం నచ్చలేదు, సత్యం ! మీ అమ్మ పిలుచుకుని రమ్మంటే నువ్వు వెళ్ళి సాధువుల్నీ, సన్యాసుల్నీ వెంటబెట్టుకుని రావడమేమిటి? వీళ్ళ తలల నిండా ఎన్ని తరాల బూజు పేరుకుపుంటుందో నీకు తెలియనిదా ? నువ్వు మీ అమ్మకు నచ్చజెప్పాలిగాని... ఐయామ్ సారీ ! నా మాటలు నిన్ను బాధపెడ్తున్నాయేమో ?" అంటూ ఆగాడు విశ్వనాథ్.

" నాకేం బాధ లేదు, డాక్టరుగారూ ! బహుశ, మీరు నిజమే చెప్తున్నారు. ఏం చెయ్యను ? మా అమ్మకు ముందునుంచీ తత్త్వాలు చెప్పించుకుని, వినే అలవాటు. నాన్నగారు పోయాక అది ఎక్కువైంది. కాదంటే బాధ పడుతుంది, రెండు రోజుల క్రితం ఎర్రిమల్లయ్య స్వామి ఒక తత్త్వం పాడి, వివరిస్తున్నాడు. నేనూ కాసేపు కూర్చుని విన్నాను. తమాషాగా అనిపించింది." సిగ్గుపడుతున్నట్టుగా అన్నాడు సత్యనారాయణ.

" ఓహో! నీకూ ఆసక్తి కలిగించిందన్నమాట ! ఏమిటో అది ?" విశ్వనాథ్ కంఠం కాస్త పదునెక్కింది.

" ఈ ప్రాంతాల వాళ్ళందరూ విన్నదే అది :

*బ్రహ్మాపట్నం పోదమంటే*
*దారి తెలియదు అన్నయా !*
*సూటిగా చుక్కాని పట్టి*
*నావ నడపవె చెల్లెలా !"*

అంటూ రాగయుక్తంగా పాడాడు సత్యనారాయణ.

" బ్రహ్మాపట్నమా ! చెన్నపట్నం కాదా ? చెన్నపట్నానికైతే దారి తెలుసుకోవచ్చు " అని, గట్టిగా నవ్వాడు విశ్వనాథ్.

సత్యనారాయణ కూడా నవ్వేశాడు.

" ఎర్రిమల్లయ్య స్వామి ఏదో వివరణ కూడా ఇచ్చాడు. నాకేమీ అర్థం కాలేదు, కానీ...."

" అర్థం కాక పోవడమే మంచిదయింది. అర్థం వుంటే కదా నీకు అర్థం కావడానికి ?"

మరోసారి గట్టిగా నవ్వాడు విశ్వనాథ్. సత్యనారాయణకి నవ్వొచ్చింది, కానీ నవ్వలేదు. విశ్వనాథ్ మనసులో ఏదో జరుగుతోందని అతనికి తోచింది. ఏమీ మాట్లాడలేక వూరికే కూర్చున్నాడు. నిశ్శబ్దం పల్చటి తెరదించింది కొద్ది నిముషాలసేపు. చివరికి, ఆ తెరను తొలగిస్తూ విశ్వనాథ్ ఇట్లా అన్నాడు :

" మీరింత తీవ్రమైన నిర్ణయానికి వస్తారనుకోలేదు. వారం, పది రోజులుగా మీలో మీరు చాలా మథన పడుతున్నట్టుగా గ్రహించాను. కానీ, ఇటువంటి నిర్ణయం తీసుకుంటారని వూహించలేదు."

సత్యనారాయణ గొంతు బరువెక్కింది.

" ఏం చెయ్యమంటావు, సత్యం ! నేనింకా ఇక్కడ వుండటంలో అర్థం లేదు. నన్ను నేను మోసగించుకుంటూ బతకలేను. ఏ ఆశతో, ఆశయంతో రెండేళ్ళ క్రిందట ఇక్కడ అడుగు పట్టానో తలుచుకుంటే గుండెను పిండినట్టవుతుంది. గతాన్ని గుర్తు చేసుకుంటే నేనెంత వెర్రివాణ్ణో కదా అనిపిస్తుంది, సత్యం! ఎమ్.బి.బి.ఎస్.లో చేరినప్పటినుండి ఒకే భావమే నా మనసులో ఎప్పుడూ వుంది. మన ప్రాంతంలోని పల్లెలలో అమాయకత్వంతో, అజ్ఞానంతో, పేదరికంలో బతుకులు వెళ్ళదీస్తున్న జనానికి వైద్యుడిగా సేవ చేయాలనే ఆశయమే నాలో ఎప్పుడూ వుండేది.

**నా ఆశయానికీ, నా ప్రేమకూ పొత్తు కుదరనప్పుడు, ప్రేమను వదులుకుని, నా ఆశయం కోసమే ఇక్కడికి వచ్చాను. నా మాటలు నీకు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయా సత్యం !**" విశ్వనాథ్ కంఠం వుద్వేగంతో కంపించింది.

*" మీరు ప్రేమించిన స్త్రీనే దూరం చేసుకుని ఇక్కడికి వచ్చారా, సార్ ! మీ వ్యక్తిత్వాన్ని ఎట్లా పొగడాలో అర్థం కావటం లేదు."* నిండు మనసుతో అన్నాడు సత్యనారాయణ.

" నేనో వున్నతమైన వ్యక్తిననీ అది అందరూ గుర్తించాలనీ నేనెప్పుడూ అనుకోలేదు సత్యం ! ఈ జనం నా వాళ్ళనే భావన వల్ల వచ్చాను. అంతే, కానీ, ఏం జరిగింది? తిరుపాలు భార్య లక్ష్మి విషయంలో నన్నెట్లా బలిచేశారో నీకు తెలుసు. తిరుపాలు చేసుకున్న కుటుంబ నియంత్రణ ఆపరేషన్ ఫెయిలై వండవచ్చని, కాబట్టి లక్ష్మికి గర్భం వచ్చే అవకాశం వుందని చెప్పాను. లక్ష్మి శీలాన్ని తొందరపడి అనుమానించకూడదని హెచ్చరించాను. కానీ, నామాట ఎవరు విన్నారు ? అందరూ గుసగుసలు పోయేవారే. నా గురించి నీచంగా మాట్లాడారు కూడా. ఇదంతా లక్ష్మి తనకు లొంగలేదని ఆ సర్పంచ్‌గాడు చేసిన కుట్ర. తిరుపాలుతో సహా అందరూ వాడి తప్పుడు మాటలకు లోబడ్డారు. చివరికి వైద్య పరీక్షలో నా అనుమానమే నిజమని తేలింది. కానీ, ఏం లాభం ? లక్ష్మి మనకు దక్కలేదు. పురుగు మందుతో తన లేత బతుక్కి ముగింపు చెప్పింది. ఈ ఘోరమైన మనుష్యుల మధ్య ఎట్లా వుండాలి, సత్యం ! వీల్లేదు, నేను వెళ్ళి తీరాలి !" ఆవేశంతో వూగిపోయాడు విశ్వనాథ్.

> "నువ్వు చేసిన పని పొరబాటని ఇప్పుడు చెబుతున్నావు. ఇప్పటికైనా మనిద్దరం వొకటైతే బాగుంటుందని రాశావు. కానీ, కొంతకాలం తర్వాత మనిద్దరం వొకటి కావడం పొరబాటని నీకూ తోచవచ్చు. కాబట్టి మనిద్దరం మంచి స్నేహితులుగా మిగిలిపోదాం. ఇదే నా నిర్ణయం..."

" మీ మాటలు వింటుంటే నాకు కూడా ఈ వూరి నుండి వెళ్ళిపోవాలనిపిస్తోంది డాక్టరుగారూ! కానీ, ఏం చెయ్యను ? ఈ జనం నా వాళ్ళనే భావనేమీ నాలో లేకపోయినా, పొట్టగడవటం కోసం ఈ వుద్యోగాన్ని, చెట్లంటే ప్రేమ వుండటం వల్ల చెట్లను పెంచే కార్యక్రమాన్న నేను చేయక తప్పదు." సత్యనారాయణ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

సాయంత్రం ఐదున్నర కావస్తోంది. కదిరి బస్టాండులో ఏమంత జనం లేరు. చలికాలపు సాయంకాలం నీరెండ నీడలను సాగదీస్తోంది.

అనంతపురం నుండి పలమనేరు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ బస్సుకోసం ఎదురు చూస్తున్నాడు విశ్వనాథ్. పద్మ ఆ బస్సులో వస్తోంది. పందలకుంటలో జరిగిన సంఘటనల తర్వాత తనలో వచ్చిన మార్పులను నేరుగా పద్మనే కలిసి తెలియ చేయటానికి గిల్టీగా ఫీలయ్యాడు. అందుకే పద్మకు ఉత్తరం రాశాడు విశ్వనాథ్. దానికి సమాధానం రాస్తూ ఫలానా రోజు తాను మదనపల్లి వెళ్తున్నానని, కదిరి బస్టాండులో కలుసుకొమ్మని రాసింది పద్మ.

చేతి వాచీ వైపు చూసుకుని " ఇంకా వో అరగంట పోవాలి " అనుకున్నాడు విశ్వనాథ్. మాటిమాటికీ పద్మ రూపం అతడి కన్నుల ముందు మెదులుతోంది. మనసు జ్ఞాపకాలను తోడుతోంది. కర్నూలులో ఎమ్.బి.బి.ఎస్. చదువుకున్న రోజులు... మూడవ సంవత్సరం చదువుతుండగా పద్మ, తాను ప్రేమించుకోవడం.. ఆ కబుర్లూ, నవ్వులూ, వెన్నెట్లో కెనాల్ గట్టుమీద ప్రక్క ప్రక్కన ఆనుకుని కూర్చుని చెప్పుకున్న వూసులూ, పాడుకున్న మౌనరాగాలూ, ఇద్దరు కాదు వొక్కరే వున్నట్టు ఏదో మధుర భావనా.. అబ్బ ! ఎట్లా గడిచాయి ఆ రోజుల ! కానీ, చివరికి విబేధాలు రానే వచ్చాయి. ఎమ్.బి.బి.ఎస్. అయ్యాక పి.జి.డిప్లొమా తీసుకుని ఇద్దరూ అనంతపురంలో ప్రాక్టీసు పెట్టాలని పద్మా, కాదు ఏదైనా వెనకబడ్డ గ్రామీణ ప్రాంతానికి పోయి వైద్యం చేయాలని తానూ. ఇద్దరూ రాజీకి రాలేక పోయారు. తాను మాత్రం కోర్సు పూర్తి అయ్యాక, ఆశయం కోసం నిర్దాక్షిణ్యంగా, పందలకుంట వచ్చాడు. పి.జి.డిప్లొమా చేసి, అనంతపురంలో ప్రాక్టీసు పెట్టింది పద్మ. రెండేళ్ళ తర్వాత మళ్ళీ ఈ రోజు పద్మను...

పెద్దగా హారన్ మోగించుకుంటూ వచ్చి ఆగింది పలమనేరు ఎక్స్‌ప్రెస్. ప్రయాణీకులు ఒకరి తర్వాత ఒకరు దిగుతున్నారు... కొందరు కాఫీ, టిఫిన్ కోసం దిగుతున్నారు. డ్రైవరు, కండక్టరు అందుకోసమే దిగారు. బస్సులో పద్మలేదు ! దిక్కుతోచనట్టుగా బస్సువైపు తదేకంగా చూస్తున్నాడు విశ్వనాథ్. ఇంతలో డ్రైవరు అతని దగ్గరకు వచ్చాడు.

" సార్ ! డాక్టరు విశ్వనాథ్‌గారు మీరేనా ? " అని అడిగాడు.

" అవును" అన్నాడు విశ్వనాథ్.

డ్రైవరు తన చొక్కా జేబులోంచి వో వుత్తరం తీసి విశ్వనాథ్ చేతికిచ్చాడు.

" డాక్టరు పద్మగారు మా కుర్రాడితో ఈ వుత్తరం పంపారు కదిరి బస్టాండులో మీ కిమ్మని. డాక్టరమ్మగారు మాకు పరిచయంలెండి. వస్తాను, సార్ !" అని వెళ్ళిపోయాడు డ్రైవరు.

గబగబా కవరు చించి, వుత్తరం బయటికి తీశాడు విశ్వనాథ్. మడతలు విప్పి, చదవసాగాడు.

" డియర్ విశ్వం,

ఐయామ్ సారీ. నేను రావటం లేదు. చాలా ఆలోచించాక ఈ ప్రయాణమే మానుకున్నాను.

ఆ రోజుల్లో నీతో ఎంతో వాదించాను. ఎన్నో విధాల నచ్చచెప్పటానికి ప్రయత్నించాను. కానీ, నువ్వు నీ మార్గంలోనే వెళ్ళావు. చివరికి వుత్తరాలు రాయటం కూడా మానుకున్నావు. నేనెంతో బాధపడ్డాను, ఈ విధంగా కూడా నీనుండి దూరం కావలసి వచ్చినందుకు. కానీ, నువ్వు చేసిన పని తప్పు అని నేననుకోలేదు. నీ ఆశయాన్ని నీ వ్యక్తిత్వంలోకి గాఢంగా తీసుకున్న విషయమని భావించాను.

నువ్వు చేసిన పని పొరబాటని ఇప్పుడు చెబుతున్నావు. ఇప్పటికైనా మనిద్దరం వొకటైతే బాగుంటుందని రాశావు. కానీ, కొంతకాలం పోయాక మనిద్దరం వొకటి కావడం పొరబాటని నీకు తోచవచ్చు. కాబట్టి మనిద్దరం

మంచి స్నేహితులుగా మిగిలిపోదాం. ఇదే నా నిర్ణయం.
-పద్మ."

ఉత్తరాన్ని మడిచి జేబులో పెట్టుకున్నాడు విశ్వనాథ్. అతడి మనసు బరువెక్కింది. ఆలోచన కదలటం లేదు. అలా స్తబ్దంగానించున్నాడు.

" నమస్కారం సార్, డాక్టరు గారూ ! ఎక్కడికో ప్రయాణమైనుట్టన్నారు ?" తల పక్కకు తిప్పి చూశాడు విశ్వనాథ్. సంచి చేతిలో పట్టుకుని కనిపించాడు ఎర్రిమల్లయ్య. అతణ్ణి చూడగానే వుత్సాహం లాంటిది కలిగింది విశ్వనాథ్‌లో.

" బ్రహ్మపట్నం వెళ్దామని బయలుదేరాను." అన్నాడు చిన్నగా నవ్వుతూ బిక్కమొగం వేశాడు ఎర్రిమల్లయ్య.

" బ్రహ్మపట్నం వెళ్ళడమేమిటి ?"

" అదేం అట్లా అడుగుతున్నారు ? బ్రహ్మపట్నానికి మీరు దారి చెబుతారట కదా ? సత్యనారాయణ చెప్పాడు." అన్నాడు విశ్వనాథ్.

" అయితే సత్యనారాయణ పొరబాటు పడ్డాడన్నామాట. బ్రహ్మ పట్నానికి నేను దారి చెప్పలేను. అసలు ఎవరూ చెప్పలేరు. ఎందుకంటే, దారి లేదు కనక." పక్కున నవ్వాడు విశ్వనాథ్.

దారి లేదంటే, బ్రహ్మపట్నం లేనట్టేగా !" లాజికల్ ప్రిన్సిపుల్ పట్టుకొని, నా చేతికి చిక్కావు చూడు అన్నధోరణిలోకి దిగాడు విశ్వనాథ్.

" అట్లా అనకండి. మన చుట్టూ వున్న ఈ ప్రపంచమంతా బ్రహ్మపట్నమే. మనం మన ఆలోచనలతో, ఊహలతో, కోరికలతో, లేనిపోని ఆశయాలతో, ఆదర్శాలతో బ్రహ్మపట్నాన్ని సృష్టిస్తాం. ఈ రెండింటికీ ఎప్పుడూ పొత్తుకుదరదు."

వినయంగా అన్నాడు ఎర్రిమల్లయ్య.

" బ్రహ్మపట్నమే తెలియాలి అంటే మరి మనమేం చెయ్యాలి ?" తనలో తెలియని అయోమయత, అసంతృప్తి అనుకోకుండా ఈ ప్రశ్నలోకి దించింది విశ్వనాథ్‌ను.

" చేసేందుకేమీ లేదు. ఈ లోకం తాను వున్న తీరునే వుంటుంది తప్ప మన వూహ ప్రకారం, మనం ఆశించే ప్రకారం వుండదు అని గ్రహించి మన పని మనం చేనుకుపోవడమే. *కిటికీలోంచి దూరంగా చూస్తే దృశ్యమంతా ఏదో కొత్త కాంతితో, వింతగా కనిపిస్తుంది. బయటకు వెళ్ళి చూస్తే అది కేవలం తానున్న తీరునే వుందని తెలుస్తుంది. ఎప్పటికప్పుడు మారుతూవుండే బ్రహ్మపట్నానికి మనం దారి ఏర్పర్చుకుని విఫలమయ్యాక కానీ దారి లేదనే విషయం అర్థం కాదు. అంత వరకూ మనం ఏదో సాధించబోతున్నట్టు ప్రత్యేకమైన వ్యక్తిగా భావిన్తూ వస్తాం.. అయ్యా డాక్టరుగారూ ! క్షమించండి. ధర్మవరం బస్సు వచ్చింది.* నేను వెళ్తున్నాను. "

అంటూ పరుగులాంటి నడకతో బస్సువైపు వెళ్ళాడు ఎర్రిమల్లయ్య.

" నేనూ వెళ్తన్నా ! అదిగో టౌన్ బస్సు వచ్చింది" అని గట్టిగా అంటూ బస్సువైపు నడిచాడు విశ్వనాథ్. **పందలకుంటలో తాను పనిచేయటంలోనేకాదు, పద్మ ప్రేమలో కూడా తాను బ్రహ్మపట్నాన్ని చూశానా, లేదా అని ఆలోచన విస్తరించటంతో అడుగులు మెల్లగా సాగాం.**

# ప్రస్తావన

గోదావరి గలగలా ప్రవహిస్తోంది. ఛార్మినార్ సిగరెట్టు కాలుస్తున్న కవికుమారునికి ఆ పొగ ఘుమఘుమగానే వున్నట్టుంది. గోదావరి గట్టు గచ్చు చప్టామీద ఏడెనిమిది మంది మిత్రులు కూర్చున్నారు.

వాళ్ల మధ్య మౌనం రాజ్యమేలుతోంది. వాళ్లు గోదావరి వంక చూస్తున్నారనుకుంటే నీళ్లల్లో మందుపోసినట్టే. వాళ్ల కళ్లు శూన్యంలోకి చూస్తున్నాయి. ఓ పావుగంట గడిచింది.

"శ్రీశ్రీ అన్నట్టు, ఈ జీవితాలు ఎగరేసిన గాలిపటాలు, కనిపించని చెయ్యేదో విసిరేసిన జాతకాలు" అన్నాడు కొటేషన్‌రావు. (అతని అసలు పేరు కోటేశ్వర్రావు).


మిగతా వాళ్లు ఉలిక్కిపడ్డారు.

"నేనొప్పుకోను" అన్నాడు జగదీష్.

"ఒప్పుకునే పరిస్థితులొచ్చాయి"అన్నాడు కవికుమారుడు.

"ఎలాంటి పరిస్థితులొచ్చినా సరే" అన్నాడు జగదీష్.

**కె.వి.ఎస్.వర్మ**



**స్మారక కథలు**

కవి కుమారుడు కళ్లు మూసుకుని, చిన్న రాగం తీసి, కళ్లు తెరిచి, "మిత్రమా, డిసెంబరు 31న తప్ప, ఇన్నేళ్లలో ఇంతమందిమి ఈ గట్టుమీద ఎప్పుడైనా కలిశామా" అన్నాడు. ఆ మిత్రునితో పాటు మిగతా మిత్రులూ 'లేద'న్నట్టు తలలూపారు.

"అలాంటప్పుడు మన కొటేషన్‌రావు చెప్పిందానికి ఒప్పేసుకుంటే తప్పేముంది" అంతా సైలంటయిపోయారు మళ్లీ.

"మన్ను తిన్న పాములాగున్నాడు అని ఓ కథలో రాసేను చాలా కాలం క్రితం. ఇప్పటికి అనుభవంలో కొచ్చింది" అన్నాడు కథ(లా)రాజు. మిగతావాళ్లంతా అతని వేపు చూసేటప్పటికి కథ(లా)రాజు గోదావరి వంక చూస్తున్నాడు. అతనికీ గోదావరి శూన్యంలాగే వుంది.

"ప్రేయసీ గృహవీధి స్పృహ తప్పిపడిపోయి, ముదిత కాలి గురుతు ముద్దుగొంటి"

" అలాంటివి జ్ఞాపకం చెయ్యకోయ్"

"ఇవేళ కొటేషన్‌రావు గొంతు మధురంగా లేదు"

"మధువు పడని గొంతు మధురంగా ఎలా వుంటుందోయ్ బుద్ధిహీనుడా" అన్నాడు కొటేషన్‌రావు కళ్లు చికిలించి.

"ఔను నిజం ఔను నిజం, ఔను నిజం నీవన్నది, నీవన్నది నీవన్నది నీవన్నది నిజంనిజం"అన్నాడు కవికుమారుడు.

"లేదు సుఖం లేదు సుఖం, లేదు సుఖం జగత్తులో" అన్నాడు కథ(లా)రాజు.

"కథ(లా)రాజుగారూ కవిత్వం చదువుతున్నారే" అన్నాడు కవి కుమారుడు.

"కవి కుమారులూ కథలు చెబుతుంటారుగా"

"జగత్తులో అనే మాట మన పరిస్థితికి అతకదేమో... తెలుగుదేశంలో అంటే చాలేమో"

"ఔను నిజం ఔను నిజం నీవన్నది నిజం నిజం... లేదు సుఖం లేదు రసం, చేదువిషం జీవఫలం..."

"కవీ, శ్రీశ్రీ కవిత్వం పాటడమేనా, నీ కవిత్వం చెప్పేదేమన్నా వుందా" అడిగాడు శాస్త్రి.

"కవిత్వమొక తీరని దాహం..."

"కవీ, నీ కవిత్వం గురించి అడుగుతున్నా"

"కొన్నాళ్లదాకా ఆ విషయం ఎత్తకు శాస్త్రీ.

"ఎన్నాళ్లదాకా"

"కొన్నాళ్లదాకా అన్నానా"

"అదే, ఎన్నాళ్లదాకా అని అడుగుతున్నానా"

"నువ్వొకడివి. పట్టుకుంటే ఒక పట్టాన వదలవు. ఇప్పట్లో రాయలేను"

"పోన్లెండి. మీకూ దేశ భక్తి పుట్టుకొచ్చినట్టుంది" అన్నాడు కథ(లా)రాజు.

"దేశ భక్తా" అన్నాడు కవికుమారుడు తెల్లబోతూ.

"ఇప్పట్లో రాయలేనన్నారు కదా. అంటే తెలుగుదేశంలో కొందరికన్నా కొంతకాలందాకా మీ బాధ వుండదు కదా" అన్నాడు కథ(లా)రాజు నవ్వుతూ.

"హు..." అన్నాడు కవికుమారుడు కన్నెర్రజేస్తూ.

"ఉడికిపోకండి కవికుమారా. సరదాకన్నాను"

"నిజంగా అన్నారనుకున్నానే" అన్నాడు నాయుడు.

కవికుమారుడు ఛార్మినార్ సిగరెట్ వెలిగించాడు. గోదావరి గలగలా ప్రవహిస్తూనే వుంది.

మిత్రులందరూ మళ్లీ మునులయిపోయారు. వీధిలైట్ల కాంతి గట్టుమీదా, గోదావరి మీదా పడుతోంది. ఆ మేరకు గోదావరి కెరటాలు చీకటి వెలుగుల్లా వున్నాయి.

పాత రైలు బ్రిడ్జి మీదనుంచి ఏదో ప్యాసింజరు రైలు మన్నుతిన్న పాములా వస్తోంది.

"ఈ దుఃఖాన్ని, ఈ కష్టాన్ని భరించలేను. నా కొడుకు నాకు కాకుండా పోయాడు అని ఒకావిడ భోరున విలపించిందట. ఆమెకు గుప్పెడు నువ్వుల గింజలిచ్చి, ఒకో ఇంటికీ వెళ్లి ఒకో నువ్వుల గింజ ఇచ్చి, నువ్వు దుఃఖం లేకుండా వున్నావా అని అడిగిరా అన్నాడట బుద్ధుడు. ఇంటింటికీ తిరిగి తిరిగి కనుక్కుని వచ్చిందట. దుఃఖం ఎరుగని వాళ్లెవరూ లేనేలేరట" అన్నాడు కవికుమారుడు నిశ్శబ్దాన్ని చీలుస్తూ.

"ఆ జాతకకథ ఇప్పుడెందుకు చెప్పినట్టు"

" చెప్పింది కవికుమారులు కదా. ధ్వని వుంటుంది"

"కథ(లా)రాజా వారన్నది నిజమే. పాపం ఆవిడ ఆ సత్యం తెలుసుకోవడానికి కాళ్లరిగేలా ఎన్ని ఇళ్లో తిరిగి వుంటుంది. ఆవిడ ఇప్పుడు మన దగ్గరి కొస్తే అన్ని ఇళ్లు తిరిగే శ్రమ తప్పేది కదా" అన్నాడు కవికుమారుడు.

"బాధే సౌఖ్యమనే భావన రానీవోయ్" అంటూ అందుకున్నాడు కొటేషన్‌రావు.

ఖంగుఖంగున దగ్గి "అదంత సులువేం కాదు" అన్నాడు కవికుమారుడు.

హైదరాబాద్ వెళ్లే గౌతమీ ఎక్స్‌ప్రెస్ రోడ్ కమ్‌రైలు బ్రిడ్జి మీద కొచ్చేసింది.

"ఇంటికి పోవాలి" అంటూ నాయుడు లేచాడు

దాంతో అంతా లేచారు. గోదావరి గట్టుదిగి రోడ్డు మీద కొచ్చారు. "మళ్లీ రేపు సాయంత్రం ఆరు గంటలకి కలుసుకుందాం" అని ఎవరూ ఎవరితోనూ అనలేదు. "రాక చస్తామా" అని ఎవరికి వాళ్లు తమలో తాము అనుకున్నారు. 1995, జనవరి 17వ తేదీ వాళ్లకలా గడిచింది.

కొటేషన్‌రావు జనాంతికంగా అన్నాడు-

"మందు మిథ్య"

**(వచ్చే వారం: తొలికథ- అతి)**